వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 285
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఆగస్టు 20, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# ములుగులో రెండో ప్రమాద హెచ్చరిక



ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్న నేపథ్యంలో రామన్నగూడెం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్. బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏటూరు నాగారం మండలం రామన్నగూడెంలో 15.83 మీటర్ల ఎత్తుకు నీరు చేరినందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాలు, గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేయడం జరిగిందని, ఎలాంటి ముప్పు ఏర్పడినా తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

– వరంగల్ వాయిస్, ములుగు



8లో..

# కొరత తీరేదెలా..?

- జోరువానలతో పెరిగిన సాగు విస్తీర్ణం
- విచ్చలవిడిగా యూరియా వాడకం
- దెబ్బ తింటున్న భూ సారం
- అవగహన కల్పించడంలో అధికారుల వైఫల్యం



8లో..

## పంట బీమా చెల్లింపుల్లో ఆలస్యం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- రైతుల సమస్యలపై పార్లమెంట్ లో నిలదీత



8లో..

## చెత్త తరలింపునకు పక్కా ప్రణాళిక

- వాహనాల సమాచారం నమోదు చేయాలి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- రాంపూర్ డంపింగ్ యార్డులో క్షేత్ర స్థాయి పరిశీలన



2లో..

## కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకోవాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- ఆత్మకూరు, దామెర కుట్టు శిక్షణా కేంద్రాల సందర్శన




# కేబుల్ పాశాలు

## ప్రాణాంతకంగా కేబుల్ వైర్లు

వివరాలు 2లో..

విద్యుత్ స్తంభాలకు అడ్డదిడ్డంగా వేలాడుతున్న కేబుల్ వైర్లు యమపాశాలుగా మారుతున్నాయి. పల్లే, పట్టణం అనే తేడా లేకుండా ఏ విద్యుత్ స్తంభాన్ని చూసినా గుట్టలు గుట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లు దర్శనమిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో తెగిపోయి రోడ్డుపై పడిన కేబుల్ వైర్లు ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. తమ అవసరాల నిమిత్తం కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు కేబుల్ వైర్లను ఏర్పాటు చేసి తర్వాత వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. దీంతో ఒక్కో విద్యుత్ స్తంభంపై కుప్పలు తెప్పలుగా కేబుల్ తీగలు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ప్రాణాంతకంగా మారుతున్న ఈ కేబుల్ వైర్లను తొలగించాలని సంవత్సరం క్రితమే ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకునేవారే కరువయ్యారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా రామంతాపూర్ లోని గోఖలేనగర్ లో జరిగిన ఘటనతోనైనా అటు అధికారులు, ఇటు కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లలో మార్పు వచ్చేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అడ్డదిడ్డంగా ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్లపై స్పందించి మరిన్ని ప్రాణాలు పోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. – వరంగల్ వాయిస్ ప్రతినిధి

- విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న యమపాశాలు
- గుట్టలు గుట్టలుగా దర్శనం
- నిర్వహణను గాలికొదిలేసిన ప్రొవైడర్లు
- పట్టించుకోని అధికారులు
- రామంతాపూర్ ఘటనతోనైనా మార్పు జరిగేనా?



# 'కేబుల్' పాశాలు

## ప్రాణాంతకంగా.. కేబుల్ వైర్లు

- విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న యమపాశాలు
- గుట్టలు గుట్టలుగా దర్శనం
- నిర్వహణను గాలికొదిలేసిన ప్రొవైడర్లు
- పట్టించుకోని అధికారులు
- రామంతాపూర్ ఘటనతోనైనా మార్పు జరిగేనా?

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** మహానగరంలోని ఏ కాలనీలో చూసినా విద్యుత్ స్తంభాలకు గుట్టలు గుట్టలుగా వేలాడుతున్న కేబుల్ వైర్లే దర్శనమిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలే ఆదారంగా కేబుల్ ఆపరేటర్లు, వివిధ ఇంటర్నెట్ ప్రొవైడర్లు తమ అవసరాల నిమిత్తం కేబుల్ వైర్లను అమర్చుతున్నారు. ఒక్కో వినియోగదారుడు టారిఫ్ విలువ, ఇతర ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని ఒక్కో సారి ఒక్కో ఇంటర్నెట్ లోకి మారిపోతున్నాడు. దీంతో ఒక్కో ఇంటికి వేర్వేరు ఇంటర్నెట్ కు సంబంధించిన రెండు మూడు కేబుల్ వైర్లు లాగుతున్నారు. దీనిలో ఒక్కదాన్ని మాత్రమే సదరు వినియోగ దారుడు వినియోగించుకోవడంతో మిగిలిన కేబుల్ వైర్లు నిరుపయోగంగా మారుతున్నాయి. అయితే తొలుత వినియోగదారుడి అవసరం నిమిత్తం ఏర్పాటు చేసిన కేబుల్ నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి యమపాశాలుగా దర్శనమిస్తున్నాయి.

### ప్రమాదాలకు కారణాలు..

కేబుల్ వైర్లు ప్రమాదాలకు కారణాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా వరంగల్ వంటి మహా నగరపాలక సంస్థ పరిధిలో ఇంటర్నెట్, కేబుల్ టీవీ సేవలకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. పలు సందర్భాల్లో విద్యుత్ శాఖ అధికారులు వారి స్తంభాలకు అమర్చిన కేబుల్స్ ను తొలగిస్తున్నారు. కేబుల్స్ వేడెక్కడం, షార్ట్ సర్క్యూట్ కావడం, కేబుల్ షీత్ దెబ్బతినడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. లెక్కకు మించి ఉంటున్న కేబుల్ వైర్లలో నిరుపయోగమైనవే ఎక్కువగా ఉంటున్నాయి. గాలి దుమారాలకు, వేగంగా దూసుకొచ్చిన వాహనాలతో పలు మార్లు కేబుల్ వైర్లు తెగి రోడ్డుపై పడుతున్నాయి. వీటిని అలాగే వదిలేయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలుడుతున్న కేబుల్ వైర్లు ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారి మెడకు చుట్టుకొని ప్రాణాపాయ స్థితి సంభవిస్తోందంటున్నారు.

### రామంతాపూర్ ఘటనతోనైనా..

శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో రథంపై శ్రీకృష్ణుడి ఉరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం భవనం నుంచి ప్రారంభమైన శ్రీకృష్ణుడి ఉరేగింపు వర్షం పడుతున్నా ముందుకే సాగింది. భక్తిశ్రద్ధలతో సాగుతున్న ఈ రథ యాత్రలో కేబుల్ వైరు అనుకోని సంఘటనకు కారణమైంది. మరో 50 అడుగుల దూరంలోనే గమ్య స్థానం ఉందనగా వేలాడుతున్న కేబుల్ వైరు కృష్ణుడి విగ్రహానికి తగిలి విద్యుదాఘాతానికి గురైంది. ఒక్క సారిగా రథాన్ని లాగుతున్న వాళ్లు గట్టిగా అరుస్తూ కిందపడిపోయారు. అప్పటికే రథం చుట్టూ ఉన్న వాళ్లు ఏం జరిగిందో అర్థం కాక పరుగులు పెట్టారు. వెనుక నుంచి రథాన్ని తోస్తున్న తొమ్మిది మంది విద్యుదాఘాతానికి గురై అపస్మార స్థితిలో పడిపోయారు. వారిని రక్షించేందుకు స్థానికులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయింది. ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలోదిలారు. మరో నలుగురిని చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు తరలించారు.

### ఏడాది క్రితమే..

కేబుల్ వైర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితమే వాటిని తొలగించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాని ఇప్పటి వరకు ఆ ఉత్తర్వులను పట్టించుకున్న వారే లేరు. విద్యుత్ స్తంభాలకు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తక్షణమే తొలగించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ సైతం ఆదేశించారు. గతంలో పలుమార్లు కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లతో సమావేశాలు నిర్వహించినా ప్రయోజనం చేకూరలేదు. రామంతాపూర్ ఘటనతో అప్రమత్తమైన ప్రభుత్వం మరో మారు కేబుల్ వైర్ల తొలగింపుకు శ్రీకారం చుట్టింది. దీంతో కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల సంఘం ప్రభుత్వంతో చర్చలు జరిపింది. అనవసరమైన కేబుల్స్ ను తొలగించడం ద్వారా కొంతవరకైనా ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వానికి సహకరిస్తామని అసోసియేషన్ ముఖ్య నేతలు ప్రకటిస్తున్నారు.

# కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకోవాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- ఆత్మకూరు, దామెర కుట్టు శిక్షణా కేంద్రాల సందర్శన



**వరంగల్ వాయిస్, దామెర :** ఆత్మకూరు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, కుట్టుకు సంబంధించిన మెలకువలను శిక్షణ కాలంలో నేర్చుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా ఎంతమంది శిక్షణ పొందుతున్నారు, కుట్టు శిక్షణలో ఎలాంటి యంత్రాలను వినియోగిస్తున్నారని కలెక్టర్ శిక్షణ పొందుతున్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. టెక్స్టైల్ పార్కులో ఉపాధి అవకాశం వచ్చినా రాకున్నా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అవసరమైతే మహిళా సంఘాల ద్వారా కుట్టు మిషన్లు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని డీఆర్డీఓ మేన శ్రీనుకు కలెక్టర్ సూచించారు. అనంతరం ఆత్మకూరులో పురోగతిలో ఉన్న పలు ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం సుజాత, తదితరులు పాల్గొన్నారు.

### దామెరలో..

హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని దామెర కుట్టు శిక్షణ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కుట్టు శిక్షణ కేంద్రం ట్రైనర్స్, కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకుంటున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. మహిళా కుట్టు శిక్షణ నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, సెర్ఫ్ అడిషనల్ డీఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కల్పన, డీపీఎం రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫొటో గ్రాఫర్లకు బహుమతులు

- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో మొదటి సారి ఏర్పాట్లు
- ముఖ్య అతిథులుగా హాజరుకానున్న బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'ఫొటో కాంపిటీషన్'లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10.30 గంటలకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి వైస్ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య హజరుకానున్నట్లు ప్రకటించారు. ముఖ్య అథిధుల చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రధానం జరుగుతుందున సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

### విజేతలు వీరే..

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్టాఫ్ ఫొటో జర్నలిస్టులకు నిర్వహించిన ఫొటో కాంటెస్ట్ విజేతలను న్యాయనిర్ణేతలు ప్రకటించారు. కేయూ జర్నలిజం విభాగధిపతి సంగాని మల్లేశ్వర్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గాదె లింగమూర్తి, కేయూ పూర్వ పీఆర్వో వేదాంతం కృష్ణమాచారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రతీ ఫొటోను క్షుణ్ణంగా పరిశీలించి కోడ్ నేమ్ ద్వారా ఫొటోలను ఎంపిక చేసిన తర్వాత పేర్లను ప్రకటించారు. ఉత్తమ వార్త చిత్రం విభాగంలో 'జీవనవైవిధ్యం' కాప్షన్ ఫొటోకు సాక్షి దినపత్రిక స్టాఫ్ ఫొటో గ్రాఫర్ పెద్దపల్లి వరప్రసాద్ కు ప్రథమ బహుమతి లభించింది. 'ఆపత్కాలం' కాప్షన్ ఫొటోకు గాను ఎతెమాద్ దినపత్రిక ఫొటోగ్రాఫర్ షర్ఫొద్దిన్ మాషూక్ కు ద్వితీయ బహుమతి, 'ఆసరాసంబురం' ఫొటోకాప్షన్ ఫొటోకు గాను నమస్తే తెలంగాణ దినపత్రిక ఫొటోగ్రాఫర్ మేరుగు ప్రతాప్ కు తృతీయ బహుమతి లభించింది. గోవర్ధనం వేణుగోపాల్, సాక్షి, సంపెట సుధాకర్, ఆంధ్రజ్యోతి, పాలకుర్తి మధు, ఆంధ్రజ్యోతి, వీరగోని హరీష్, ఆంధ్రజ్యోతి, ఆవుల సంపత్, ఈనాడుకు కన్సోలేషన్ బహుమతులు దక్కాయి. ఇప్పటివరకు వరంగల్ లో ఫొటో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా కాంపిటేషన్ పెట్టలేదని గుర్తు చేశారు. తమ కమిటీ ఫొటో జర్నలిస్టుల కోసం ఆలోచించి వారిని గౌరవించటం సముచితమని భావించి ఈ పని చేశామన్నారు. ఉత్తమ న్యూస్ పిక్చర్ కు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు నగదు బహుమతి, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, ద్వితీయ బహుమతికి రూ.5 వేలు, తృతీయ బహుమతికి రూ.3 వేలు నగదు బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతి కింద ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రము అందజేయడం జరుగుతుందని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, బోల్ల అమర్ తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, ఆగస్టు 20, 2025

# చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్ పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు చావ రవి, ఎన్. తిరుపతి, టి. లింగారెడ్డి తెలిపారు. ఈ మహా ధర్నాను జయప్రదం చేయాలని వారు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు విన్నవించినప్పటికీ, మంత్రివర్గ ఉప సంఘం, అధికారుల కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కామన్ సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు కావడం లేదని, నెలకు రూ. 700 కోట్లు ఇస్తామన్న హామీ అమలు కావడం లేదని అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల సమస్యలు సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్య చికిత్స హామీ కూడా అమలు కావడం లేదని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు




ఓపీఎస్ (పాత పెన్షన్ స్కీం) ఇవ్వాలని కోర్టు ఆదేశించినా, ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు 20 నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. ఈ 31 సమస్యలపై యూఎస్ పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ స్పందన లేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఈ మహా ధర్నాకు పూనుకున్నామని నాయకులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ. శ్రీనివాస్ రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్. రమేష్, జి. ఉప్పలయ్య, బి. శ్రీరామ్, తాటికాయల కుమార్, కె. శ్రీనివాస్, పి. సుజన్ ప్రసాద్, ఎ. గోవిందరావు, ఎం. ఎ. బాసిత్, కె. భోగేశ్వర్, ఎం. దామోదర్, పి. మనోజ్, కె. రవిచందర్, బి. రవీందర్, టి. తావు, పట్టాభి పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ గొడుగుల వితరణ




**వరంగల్ వాయిస్, జనగామ :** లయన్స్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ డాక్టర్ డి.లవకుమార్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని లయన్స్ క్లబ్ బీబాయిస్ ఆధ్వర్యంలో జనగామలోని చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. బుధవారం ఉదయం జనగామ బస్టాండ్ సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కన్నా శ్రీనివాస్ మాట్లాడుతూ లవకుమార్ రెడ్డి లయన్స్ సంస్థ విస్తరణకు విశేష కృషి చేశారని, పూర్వ జిల్లా గవర్నర్‌గా, తెలంగాణ ఐఎంఏ అధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన అందరి ప్రేమాభిమానాలను చూరగొన్న వ్యక్తి అని అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ లవకుమార్ రెడ్డి మాట్లాడుతూ యువకులతో కూడిన బీబాయిస్ క్లబ్ సభ్యులు తన పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. క్లబ్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు, జోన్ చైర్మన్ బి.బాల భరద్వాజ్, క్లబ్ సభ్యులు మంగ వెంకటేశ్వర్లు, లగిశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా విష్ణుదాస్ వంశీధర్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండలం, గుండేడు గ్రామానికి చెందిన విష్ణుదాస్ వంశీధర్ రావు నియమితులయ్యారు. బ్రాహ్మణ సంఘంలో, సామాజిక కార్యక్రమాలలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పదవి లభించింది. ఈ నియామకాన్ని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము, రాష్ట్ర చైర్మన్ జగన్ మోహన్ శర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా వంశీధర్ రావు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము, రాష్ట్ర చైర్మన్ జగన్మోహన్ శర్మ, యువజన రాష్ట్ర అధ్యక్షులు దండిబోట్ల రామాంజన్ కుమార్ శర్మలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సంఘం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తన వంతు కృషి చేస్తానని, అప్పగించిన బాధ్యతలను ముందుండి నిర్వహిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు ఉదయ మర్రి కృష్ణమూర్తి, దర్శనం మాసపత్రిక సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, అర్చక జేఏసీ అధ్యక్షులు గంగు ఉపేందర్ శర్మ, ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకర్, కోశాధికారి విజయ సారధి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దండాపంతుల గోపీనాథ్ శర్మ, టీబీఎస్ఎస్ఎస్ ప్రణాళిక కమిటీ చైర్మన్ నమిలికొండ కిరణ్, యువజన అధ్యక్షులు దండిబొట్ల రామాంజన్ కుమార్ శర్మ, నాయకులు జగార్లపూడి శ్రీనివాస్ శర్మ, దేవులపల్లి హరిహరన్, మోత్కూరి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



# కూలిన ఇళ్లకు ఇందిరమ్మ పథకం మంజూరు చేయాలి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయిన పాత ఇళ్లకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇళ్లను మంజూరు చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీమాబాద్‌లోని కటికవాడలో నివసించే రాముల స్వరూప శ్రీనివాసులు అనే దంపతుల పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయిన సందర్భంలో, కార్పొరేటర్ రవి వారి ఇంటికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఇల్లు కూలిపోయిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఆయన తెలిపారు. కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి తక్షణ సాయం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ, పాత, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు రాముల బాబు పాల్గొన్నారు.

# బుర్ర అపర్ణకు డాక్టరేట్ పట్టా ప్రదానం



**వరంగల్ వాయిస్, జనగామ :** మండలంలోని ఓబుల్‌కేశ్వాపురం గ్రామానికి చెందిన బుర్ర అపర్ణ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బుర్ర శంకరయ్యగౌడ్–లక్ష్మి దంపతుల కుమార్తె అయిన అపర్ణ, 84వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా ఈ గౌరవాన్ని పొందారు. అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించిన అపర్ణ, పట్టుదలతో కష్టపడి భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ సాధించి మహిళలకు గర్వకారణంగా నిలిచారు. డిగ్రీ వరకు జనగామలో చదువుకున్న ఆమె, ఆ తర్వాత పీజీ, పీహెచ్‌డీ రెండింటికీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మహమ్మద్ కలీం అహ్మద్ జలీలి పర్యవేక్షణలో ఆమె నానోఫెరైట్ అనే అంశంపై పరిశోధన చేసి ఈ డాక్టరేట్ పట్టా సాధించారు. ప్రస్తుతం అపర్ణ హైదరాబాద్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో భౌతిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

# నేషనల్ హైవే కార్యాలయం ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేషనల్ హైవే 163 రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నందుకు గాను, నేషనల్ హైవే అథారిటీ కార్యాలయ ఆస్తులను జప్తు చేయాలని హనుమకొండ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కోర్టు సిబ్బంది, బాధితుల తరపు న్యాయవాదులు, భూ నిర్వాసితులు బుధవారం హనుమకొండలోని హంటర్ రోడ్డులో ఉన్న నేషనల్ హైవే కార్యాలయానికి చేరుకున్నారు. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం, కార్యాలయ ఫర్నీచర్, కంప్యూటర్లు, ఇతర సామాగ్రిని జప్తు చేయడానికి కోర్టు సిబ్బంది ప్రయత్నించగా, మేనేజర్ ఇతర ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులు వారిని అడ్డుకున్నట్లు భూ నిర్వాసితుల తరపు న్యాయవాదులు దయ్యాల సుధాకర్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, మరియు నరేందర్ యాదవ్ తెలిపారు. కోర్టు విధులకు ఆటంకం కలిగించి, సామాగ్రిని జప్తు చేయకుండా నిరోధించినట్లు వారు చెప్పారు. కోర్టు సిబ్బంది తమ విధులకు ఆటంకం కలిగించవద్దని కోరినప్పటికీ, నేషనల్ హైవే సిబ్బంది వారిపై దురుసుగా ప్రవర్తించి, “మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి” అంటూ పరుష పదజాలం ఉపయోగించినట్లుగా న్యాయవాదులు పేర్కొన్నారు. సుమారు 13 గ్రామాల ప్రజలు 2013లో నేషనల్ హైవే కోసం తమ భూములను కోల్పోయారు. ఆ సమయంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నామమాత్రపు పరిహారాన్ని చెల్లించి, రోడ్డు



నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. దీనిపై పైడిపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు జిల్లా కలెక్టర్, ఆర్బిట్రేటర్ వద్ద అప్పీల్ దాఖలు చేశారు. అప్పీల్‌లో భాగంగా, 2015లో అప్పటి జిల్లా కలెక్టర్, ఆర్బిట్రేటర్ స్క్వేర్ మీటర్‌కు రూ.400 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంచిన పరిహారాన్ని నిర్వాసితులకు చెల్లించడంలో నేషనల్ హైవే అథారిటీ జాప్యం చేయడంతో, జిల్లా న్యాయమూర్తి ఆస్తుల జప్తుకు ఆదేశాలు ఇచ్చారు. అయితే, ఈ ఆదేశాలను కూడా నేషనల్ హైవే కార్యాలయ సిబ్బంది అమలు చేయకుండా అడ్డుకున్నారని భూ నిర్వాసితుల తరపు న్యాయవాదులు దయ్యాల సుధాకర్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, నరేందర్ యాదవ్ తెలిపారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ పట్ల నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలిచిందని న్యాయవాదులు అన్నారు.

# ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలి

**వరంగల్ వాయిస్, దామెర:** ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ బుధవారం దామెర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నేరాల నియంత్రణతో పాటు ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా పోలీసులు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించిన డీసీపీ, కేసుల నమోదు, క్రైమ్ రికార్డులు, సన్నిహిత పిటిషన్లు, క్రైమ్ చార్ట్, ప్రాపర్టీ రూమ్, క్రైమ్ ఫైల్స్‌పై తనిఖీలు చేశారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేసి, నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. గ్రామ పోలీస్ అధికారులుప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచుకోవాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడిని గౌరవంగా చూడాలని డీసీపీ అంకిత్ కుమార్ సూచించారు. యువతను తప్పుదోవ పట్టించే అంశాలపై, ముఖ్యంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

# ఐటీ రంగానికి పెద్దపీట వేసిన రాజీవ్ గాంధీ

**■ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్**



**వరంగల్ వాయిస్, పరకాల:** మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుడని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, యువకుల కోసం ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. ముఖ్యంగా, ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనని పేర్కొన్నారు. ఆయన హయాంలో టెలికమ్యూనికేషన్స్, రక్షణ, వాణిజ్యం, విమానయాన రంగాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రజలే తన ప్రాణమని భావించి దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడని శ్రీనివాస్ గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతోందని కొయ్యడ శ్రీనివాస్ విమర్శించారు. జీఎస్టీ భారంతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తోందని, బీహార్‌లో ఓట్ల చోరీతో అధికారంలోకి వచ్చి దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని మండిపడ్డారు.. భారత రాజ్యాంగాన్ని కాపాడే దిశగా రాహుల్ గాంధీ పయనిస్తున్నారని, దేశ ప్రజలందరూ ఆయన వెన్నంటి నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నం కొండ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, సమన్వయ కమిటీ సభ్యులు చిన్నల గోనాథ్, ఎండి రంజాన్ అలీ, పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, మెరుగు శ్రీశైలం గౌడ్, చందుపట్ల రాఘవరెడ్డి, సదానందం గౌడ్, మడికొండ శీను, మంద నాగరాజు, ఒంటేరు శ్రవణ్ కుమార్, లక్కం వసంత, ఎండి కాయముద్దీన్, బుచ్చు భాస్కర్, దొమ్మాటి బాబురావు, చిలువేరు రాఘవ, మహేందర్, బుచ్చు జెమిని, ఒంటరి వరుణ్, వక్కేలి రాహుల్ పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

### కాంగ్రెస్ నేత దూదిపాల బుచ్చిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** భారతదేశ యువత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చారిత్రాత్మకమని కొనియాడారు. ముఖ్యంగా, ఐటీ రంగం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. దేశంలో విప్లవాత్మకమైన మార్పులకు రాజీవ్ గాంధీ కారకులని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడాలంటే సాంకేతికతలో ముందుండాలని ఆయన గుర్తించారని తెలిపారు. సాంకేతికతతో పాటు రాజీవ్ గాంధీకి సామాజిక చైతన్యం కూడా ఉందని, మహిళలకు ప్రాధాన్యత కల్పించి, మహిళా సాధికారతకు అడుగులు వేశారని బుచ్చిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిందం రవి, బాసని మార్కండేయ, ఏరుకొండ శంకర్, మోతే వెంకన్న, గోపాల్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## గణపురంలో..



**వరంగల్ వాయిస్, గణపురం:** దివంగత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గణపురం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ ఆధ్వర్యంలో జరిపారు. ఈ వేడుకల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరు శ్రీనివాస్, మండల అధికార ప్రతినిధి మామిండ్ల మల్లికార్జున గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, మాజీ సర్పంచ్ నారగని దేవేందర్ గౌడ్, గుర్రం తిరుపతి గౌడ్, గుర్రం సదానందం, యువజన నాయకుడు దూడపాక పున్నం, సీనియర్ నాయకులు ఇమ్మడి వెంకటేశ్వర్లు, రామగిరి సంపత్, సుధాకర్ రెడ్డి, ఆలూరి మొగిలయ్య, ఎస్.కె. జానీ, మోషే, గణేష్ పాల్గొన్నారు.

## చిట్యాలలో..



**వరంగల్ వాయిస్, చిట్యాల:** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేసి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూట్ల తిరుపతి మాట్లాడుతూ భారతదేశంలో ఐటీ రంగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య, చిట్యాల టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్, మండల యూత్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు పిట్టల సాంబయ్య, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ రాజ్ మహమ్మద్, నాయకులు బుర్ర మల్లేష్, ఏరుగొండ గణపతి, నర్ర శివరామకృష్ణ, పుల్ల సమ్మయ్య, సరికొమ్ముల సదయ్య, శనిగరం మొగిలి, అందుకుల రాజు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, పాలకుర్తి:** భారత రత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు బుధవారం పాలకుర్తిలో ఘనంగా జరిగాయి. పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యురాలుయశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశానికి ఆధునికతకు నాంది పలికిన దూరదృష్టి కలిగిన నాయకుడని అన్నారు. దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సాంకేతిక విప్లవం, పంచాయతీరాజ్ వ్యవస్థ, యువతకు అవకాశాలు కల్పించడంలో చూపిన దృక్పథం నేటికీ అందరికీ ప్రేరణ అని ఆమె తెలిపారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ సమగ్రాభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని, ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, యువత సాధికారతకు ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు సేవ చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన నాయకులు పాల్గొని రాజీవ్ గాంధీ గారికి పుష్పాంజలి ఘటించి ఆయన స్ఫూర్తిని స్మరించుకున్నారు.

## దుండి అశోక్‌కు డాక్టరేట్ ప్రదానం



**వరంగల్ వాయిస్, గీసుకొండ:** గీసుకొండ ప్రభుత్వ మోడల్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న దుండి అశోక్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 84వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్‌ను స్వీకరించారు.దుండి అశోక్ 'ఆన్ టీచబులిటీ ఇన్ మైథలాజికల్ పర్సెప్షన్స్', 'హెటెరోగ్లాసియా ఇన్ ట్రాన్స్‌లేషన్' వంటి పలు పరిశోధనా పత్రాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించారు. స్వంత రచనలు కూడా చేశారు. కళాశాల విద్యార్థుల కౌమార దశ మనస్తత్వాలకు అనుగుణంగా బోధిస్తూ, విద్యార్థులకు 'ఫ్రెండ్లీ లెక్చరర్' గా పేరు పొందారు. మహబూబాబాద్ జిల్లా, చిన్నగూడూరు మండలం, పగిడిపల్లికి చెందిన దుండి అశోక్, చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం కళాశాల అధ్యాపకుడిగా రాణిస్తున్నారు.

## మైలారంలో చోరీ : నిందితుడి అరెస్టు

**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండలంలోని మైలారం గ్రామంలో జరిగిన ఒక చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మైలారం గ్రామానికి చెందిన మూల రాజు కుమారుడు సుధాకర్ రెడ్డికి చెందిన కిరాణా షాపు షట్టర్ తాళం పగలగొట్టి దొంగతనం చేసిన ఆకారపు కుమారస్వామి (కొమురయ్య కుమారుడు)ని శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆకారపు కుమారస్వామి పథకం ప్రకారం రాత్రి సమయంలో షాపు తాళం పగలగొట్టి, గల్లా పెట్టెలో ఉన్న రూ.10,000 నగదును దొంగిలించాడు. ఈ సందర్భంగా ఎస్సై పరమేశ్వర్ మండల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలు దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# సమాచార విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశంలో ఐటీ విప్లవానికి పునాదులు వేసిన మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. డీసీసీ భవన్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, నాయకులు ఎం.జి.ఎం. ఆస్పత్రి కూడలిలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కూడా పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ సేవలు, ఆలోచనలు దేశ పురోగతిలో గణనీయమైనవని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడని, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడని అన్నారు. సమాచార విప్లవానికి ఆద్యుడని, ఐటీ రంగానికి పునాదులు వేసిన దూరదృష్టి గల వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రధానిగా తక్కువ కాలంలోనే ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీరిలో కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా నాయకులు పెరుమాండ్ల రామకృష్ణ, అజీజ్ ఉల్లా, బంక సంపత్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు పరమేష్, మహిళా నాయకులు మేరీ, సుకన్య, రహీమున్నిసా, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న ప్రభుత్వం

## ■ సమ్మెకు సీఐటీయూ మద్దతు


**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** గత 20 సంవత్సరాలుగా కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లోని మెన్స్, ఉమెన్స్ హాస్టల్‌లో పనిచేస్తున్న 86 మంది కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య ఆరోపించారు. ఎనిమిది నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. 9వ రోజు సమ్మెలో భాగంగా కార్మికులు ఏకశిలా పార్కు నుంచి అదాలత్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి తిరిగి ఏకశిలా పార్కుకు చేరుకున్నారు. దారి పొడవునా "ప్రభుత్వం మొండి వైఖరి నశించాలి", "సీఐటీయూ జిందాబాద్", "8 నెలల బకాయి వేతనాలు చెల్లించాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్. వీరయ్య మాట్లాడుతూ మెడికల్ కాలేజీ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. టెండర్లు పిలిచే ముందు కార్మికుల వేతనాలు సక్రమంగా చెల్లించే నిబంధనలు ఉన్నాయా లేదా అని చూసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. సదరు కాంట్రాక్టర్ వెంటనే




ఎనిమిది నెలల బకాయి వేతనాలను కార్మికులకు చెల్లించాలని, జిల్లా యంత్రాంగం ఈ సమస్యపై చొరవ తీసుకుని సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నా, కార్మికులు వేతనాల కోసం రోడ్డుపైకి వచ్చినా జిల్లా ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి సుధాకర్, యూనియన్ నాయకులు అల్లం రమేష్, రాణి, రాజకుమారి, ఎండీ అతిక్, రాము, మంద కవిత, రవి, బాబు, శశి, సుమన్, వంశీ, ప్రశాంత్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ధనైరా సిల్క్స్ షోరూం ప్రారంభం

## హాజరైన సీరియల్ ఫేమ్ సుహాసిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలకు అవసరమైన సరికొత్త వేరైటిలతో కూడిన పట్టు సిల్క్స్ సారీలు అందుబాటులో కి వచ్చాయని సీరియల్ ఫేమ్ సుహాసిని అన్నారు. సుబేదారి ఎస్ బీహెచ్ కాలనీలోని వంగల దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధనైరా సిల్క్స్ షోరూంను బుధవారం సీరియల్ ఫేమ్ సుహాసిని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీరియల్ ఫేమ్ సుహాసిని మాట్లాడుతూ వరంగల్ నగరానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ధనైరా సిల్క్స్ షోరూంలో నగర ప్రజలకు సరైన వేరైటీలతో కూడిన కొత్త డిజైన్ లతో పట్టు, వెడ్డింగ్, బెనారస్, ఫ్యాన్సీ సారీలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. 10 వేల రూపాయలు కొనుగోలు పై నాలుగు గ్రాముల వెండి నాణెం ను ఉచితంగా ఇస్తున్నారన్నారని, అలాగే 20 వేల రూపాయలు కొనుగోలుపై ఎనిమిది గ్రాముల వెండి నాణెంను ఉచితంగా ఇస్తున్నారన్నారని అలాగే 50 వేల రూపాయలు కొనుగోలుపై 20 గ్రాముల వెండి నాణెంను ఉచితంగా ఇస్తున్నారన్నారని అన్నారు.నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధనైరా సిల్క్స్ షోరూంను అన్ని నగరాలలో ప్రారంభించాలని సూచించారు. అనంతరం అభిమానులతో సందడి చేశారు. ఈ కార్యక్రమం లో ధనైరా సిల్క్స్ షోరూం యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రుద్రేశ్వర దేవాలయాన్ని సందర్శించిన నిత్యానందరావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లాలోని చారిత్రక రుద్రేశ్వర స్వామి (వేయి స్తంభాల) దేవాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వెల్దండ నిత్యానందరావు సందర్శించారు. బుధవారం ఉదయం నిత్యానందరావు దంపతులతో పాటు, వరంగల్ తెలుగు యూనివర్సిటీ పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న, యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ గంప సతీష్ కూడా దేవాలయానికి విచ్చేశారు. దేవాలయ అర్చకులు వారికి స్వాగతం పలికి, అంతరాలయంలోని రుద్రేశ్వరునికి రుద్రా అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించి, వేద ఆశీర్వచనం చేశారు. దేవాలయ ప్రాశస్త్యాన్ని వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆచార్య నిత్యానందరావు మాట్లాడుతూ వేయి స్తంభాల దేవాలయం చారిత్రక నిలయమని, కాకతీయులు సమాజ శ్రేయస్సు కోసం గొలుసుకట్టు చెరువులు, ఆధ్యాత్మిక దేవాలయాలు నిర్మించారని పేర్కొన్నారు. కాకతీయులకు తెలుగు భాషపై మంచి పట్టు ఉందని, వారి పరిశోధన గ్రంథాలు, చరిత్ర పుస్తకాల ద్వారా ఆ విషయం తెలుస్తుందని అన్నారు. శివతత్వాన్ని తెలిపే శిల్పకళా సౌందర్యాలు కాకతీయుల గొప్పతనాన్ని చాటి చెబుతాయని కొనియాడారు.

# సంపత్ రాజారాం యాదవ్‌కు ఘన నివాళి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** డాక్టర్ ధర్మపురి సంపత్ రాజారాం యాదవ్ 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం బుట్టి శ్యామ్ యాదవ్ అధ్యక్షతన, గండు అశోక్ పర్యవేక్షణలో జరిగింది. మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ సంపత్ రాజారాం యాదవ్ జీవితాంతం బీసీల హక్కుల కోసం పోరాడిన గొప్ప సమాజ సేవకుడని కొనియాడారు. బలహీన వర్గాల అభ్యున్నతే తన కర్తవ్యంగా భావించి, నిరంతరం ఉద్యమ పంథాలో ముందుండి నడిచారని అన్నారు. వరంగల్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఆయన అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా తెలంగాణ యువతలో సేవా స్ఫూర్తి, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించడానికి ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన ఆత్మసమర్పణ, త్యాగం, సేవా స్ఫూర్తి తరతరాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. సమాజం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని, ఆయన చూపిన దారిలో ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతం నయీంనగర్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ జన్ను అనిల్, డాక్టర్ విజయలక్ష్మి, ఏసీపీ రవీందర్ కుమార్, గడ్డం భాస్కర్, డాక్టర్ కూరపాటి రమేష్, వరంగల్ యాదవ సంఘం అధ్యక్షులు గిరబోయిన రాజయ్య యాదవ్, జనగామ జిల్లా అధ్యక్షులు బనక సంపత్



యాదవ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్, కావటి కవిత, కంకణాల మల్లేశం, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ ఎర్ర శ్రీధర్ రాజు, కార్పొరేటర్ బొంగు అశోక్, ఎల్లావుల కుమార్ యాదవ్, బ్లడ్ డోనర్స్ బుట్టి శ్యామ్ యాదవ్, బగ్గీ రాజు, బొల్లం వెంకటేశ్వర్లు, గాలి సుధాకర్, 20 మంది రక్తదాతలు పాల్గొన్నారు.

# సంఘ సభ్యుడికి స్థలం ఇవ్వడమే మా సంకల్పం

## శ్రీ భద్రకాళి పరపతి సంఘం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ కాశిబుగ్గలోని శ్రీ భద్రకాళి పరపతి సంఘం ఆధ్వర్యంలో జనగామలో తొమ్మిది ఎకరాల స్థలంలో లేఅవుట్ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. సంఘ సభ్యులందరికీ ప్లాట్లు కేటాయించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారు. సంఘం అధ్యక్షులు గుళ్ళపల్లి రాజ్ కుమార్ (బాంబుల కుమార్), కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యుల సహకారంతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. ప్రతి ఒక్క సభ్యునికి "కుడా" లేఅవుట్ చేసి ప్లాట్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ వర్తక సంఘం అధ్యక్షులు గుండేటి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బయ్య స్వామి, యునైటెడ్ కార్పొరేషన్ అధ్యక్షులు గుండేటి నరేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, గౌరవ సలహాదారులు ధూపం సంపత్, వివేకానంద యోగ పరపతి సంఘం అధ్యక్షులు కూరపాటి సుదర్శన్, లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షులు వంగర ప్రసాద్, శ్రీ భద్రకాళి పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి గోగి కార్ కిరణ్, కోశాధికారి మాటేటి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు గోరంట్ల మనోహర్, సల్లా రాజేందర్, సిద్ధోజు శ్రీనివాస్, ఇప్పలపల్లి శివాజీ, కోయల్ కార్ నందకిషోర్, గుర్రపు సత్యనారాయణ, గుత్తికొండ నవీన్, గుల్లపల్లి సాంబశివుడు, వంగరి రవి, వెంగళ లక్ష్మణ్, సిందం చంద్రశేఖర్, రామ యాదగిరి, పోత్కనూరి రాజు, ములుక సురేష్, బండారి శ్రీనివాస్, ఇతర కమిటీ సభ్యులు మరియు వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** కుటుంబ కలహాలతో విషం తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన నెక్కొండ మండలం, బంజరుపల్లిలో చోటు చేసుకుంది. మృతురాలి భర్త తడుగుల భాస్కర్ ఫిర్యాదు మేరకు పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బంజరుపల్లికి చెందిన తడుగుల భాస్కర్, అతని భార్య మధులత (39) ఆశా వర్కర్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు, పెద్ద కుమారుడు అశ్విత్ (14), చిన్న కుమారుడు యశ్వత్ (10). గత నాలుగు సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్య కుటుంబ సమస్యల కారణంగా గొడవలు జరుగుతుండటంతో మధులత తన తల్లి వద్ద ఉంటోంది. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు మధులత గుర్తు తెలియని గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఆమెను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ఆగస్టు 19న రాత్రి 10.57 గంటలకు మృతి చెందింది. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తీన్మార్ మల్లన్నను కలిసిన బాపు యాదవ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** వరంగల్, నల్గొండ, ఖమ్మం ఎమ్మెల్సీగా ఇటీవల విజయం సాధించిన తీన్మార్ మల్లన్నను మంచిర్యాలలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం.) ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలపై ఆయనకు ఒక వినతిపత్రం అందజేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ దేవనబోయిన బాపు యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 510 వల్ల సుమారు 4,000 మంది ఉద్యోగులకు అన్యాయం జరిగిందని వివరించారు. ఈ జీవో వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని, దీనిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జోక్యం చేసుకుని వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఎం. కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ మంచిర్యాల జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

## పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి



**వరంగల్ వాయిస్, గణపురం:** గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మొరంచ వాగు వరదతో మునిగిపోయిన వరి పొలాలను వెంటనే అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని గణపురం మాజీ సొసైటీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వర్షాల వల్ల వరి పంట పూర్తిగా దెబ్బతినిందని, పొలాల్లో ఇసుక దిబ్బలు పేరుకుపోయాయని, పత్తి పంట కూడా నష్టపోయిందని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి, వ్యవసాయ మరియు రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు పూర్ణచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడం వల్ల వర్షాల అనంతరం దోమల నివారణ చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతోందని, అధికారులు వెంటనే స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**వరంగల్ వాయిస్, జనగామ:** లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ డి. లవకుమార్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ బండ భిక్షపతి సమక్షంలో 105 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ లవకుమార్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా, మిలీనియం క్లబ్ సభ్యుడు గందే కృష్ణ మోహన్ పుట్టినరోజు సందర్భంగా రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో జోన్ చైర్మన్ బైరు వెంకటేశ్వర్లు, రీజియన్ చైర్మన్ రామిని శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి కాముని వెంకట వరప్రసాద్, పీ.ఆర్.సీ ఏనుగు నర్సిరెడ్డి, శ్రీనివాస్ బాబు, వేణుగోపాల్ రెడ్డి, బాల్దే మల్లేశం, యాట వెంకటేశ్వర్లు, ఎలికట్టే నరేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



**వరంగల్ వాయిస్, పరకాల:** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు గీసుగొండ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో దస్రు తండా, నందనాయక్ తండా, హర్జా తండా, గంగదేవిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని ఈ సమావేశాల్లో చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తిప్పికొట్టాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మండల పార్టీ కార్యదర్శి చల్లా వేణు గోపాల్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు బోడకుంట్ల ప్రకాష్, అంకతి నాగేశ్వర్ రావు, పుంద్రు జైపాల్ రెడ్డి, ముంత రాజయ్య, కంబాల కోటి, గుర్రం రఘు, యూత్ అధ్యక్షుడు శిరిశె శ్రీకాంత్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జూలూరి లెనిన్, యూత్ నాయకులు ప్రమోద్, మంద రాజేందర్, రాజు, గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు, యూత్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘా

## ◆ ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** మండలంలోని ముచ్చర్ల గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వల్ల గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొంటుందని అన్నారు.కుల, మత, రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు కలిసిమెలిసి ఉండాలని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా, గ్రామంలో బెల్టు షాపులను పూర్తిగా నిషేధించేందుకు గ్రామ అభివృద్ధి కమిటీ, యువత చేసిన కృషిని ఆయన అభినందించారు. ఇతర గ్రామాలు కూడా ముచ్చర్ల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రామ పోలీస్ అధికారి నాగపూరి యాదగిరి గౌడ్‌ను ఏసీపీ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి సీఐ చేరాలు, ఎస్సై రవికుమార్, సిద్దయ్య, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్ కుమార్, మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, పెద్ది ఇంద్రసేన రెడ్డి, మాదూరి మనోహర్, మండల రవీందర్, చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, సుర ప్రతాప్, దామెర శ్యామ్, సారయ్య, మూర్తి అయ్యగారు, మాట్టడ సాంబయ్య, ప్రతాప్, జితేందర్, సాంబరాజు, పులిగారి రాజేష్, సుర ప్రమోద్, రాము యాదవ్, కంచనకుంట్ల మల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, రావుల యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐని కలిసిన బీజేపీ నేతలు



**వరంగల్ వాయిస్, గణపురం:** గణపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్ రావును బుధవారం మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు సీఐని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సోమా దామోదర్, దుగ్గిశెట్టి పున్నం చందర్, మహిళా నాయకురాలు బొల్లం అరుణ, మండల ప్రధాన కార్యదర్శి చెలమల ప్రవీణ్, కోశాధికారి వడ్డెం రాజశేఖర్, బిల్లా దేవేందర్, రేపాక సంతోష్, భూక్యా హరిలాల్, దూడపాక సతీష్, సందీప్, దూడపాక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ



వరంగల్ వాయిస్, దామెర : ఇటీవల మరణించిన దామెర మండలం, ఊరుగొండ గ్రామానికి చెందిన జున్ను సమ్మక్క కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మృతురాలు సమ్మక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మరణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఆయనతో పాటు మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# ఓసీ త్రీ మట్టిని ఉచితంగా అందించాలి

## బీజేపీ నాయకుడు నవీన్ రావు



**వరంగల్ వాయిస్, గణపురం:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఓసీ–3 మట్టిని సింగరేణి సంస్థ ద్వారా ఉచితంగా అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఊర నవీన్ రావు డిమాండ్ చేశారు. బుధవారం గణపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్‌కు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నవీన్ రావు మాట్లాడుతూ, గణపురం మండలంలోని పలు గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుంటున్నారని, అయితే గృహ నిర్మాణాలకు అత్యవసరమైన మట్టి అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో మట్టి లభ్యం కాకపోవడంతో పాటు, ఉన్న ప్రాంతాల్లో మట్టి తీయడానికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు లభించడం లేదని ఆయన చెప్పారు. కాబట్టి, మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం సింగరేణి ఓసీ–3 మట్టిని సింగరేణి అధికారులతో మాట్లాడి ఉచితంగా ఇప్పించాలని ఆయన ఎంపీడీఓను కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సోమా దామోదర్, దుగ్గిశెట్టి పున్నం చందర్, మహిళా నాయకురాలు బొల్లం అరుణ, మండల ప్రధాన కార్యదర్శి చెలమల ప్రవీణ్, కోశాధికారి వడ్డెం రాజశేఖర్, భూక్యా హరిలాల్, రేపాక సంతోష్, దూడపాక సతీష్, రాజేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా యూరియా పంపిణీ

## ■ మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** గత కొన్ని రోజులుగా యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తొర్రూరు, పెద్దవంగర మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. బుధవారం మండలంలోని పీఏసీఎస్ సెంటర్‌లో యూరియా ఇప్పించాలని కోరుతూ ఒక రైతు ఫ్యాక్స్ సిబ్బంది కాళ్లకు మొక్కి వేడుకోవడం అక్కడివారిని కలచివేసింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు వెంటనే పీఏసీఎస్‌కు చేరుకుని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతులు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నామని, అధికారులు తమ దరఖాస్తు పత్రాలు తీసుకుంటున్నారే తప్ప యూరియా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు తమ పత్రాలను బాత్రూమ్ పక్కన పడేశారని నేరుగా చూపించి వాపోయారు. ఈ పరిస్థితిని గమనించిన నాయకులు, అప్పటికే అక్కడికి వచ్చిన ఆర్డీఓ గణేష్‌ను కలిసి రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. రైతులకు తగినన్ని యూరియా బస్తాలు సకాలంలో అందించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళా రైతుల కోసం ప్రత్యేక క్యూ పద్ధతిని ఏర్పాటు చేసి వారికి త్వరగా యూరియా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు ఇబ్బందులు పెట్టకుండా మూడు రోజుల్లో మండలంలోని రైతులకు యూరియా పంపిణీ పూర్తి చేయాలని ఆర్డీఓకు కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల మాజీ జడ్పీటీసీ, జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, పాలకుర్తి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాకనాటి సునీల్ రెడ్డి, తొర్రూర్ బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జి శ్రీరామ్ సుధీర్, ఫ్యాక్స్ డైరెక్టర్లు జనార్ధన్ రాజు, ధరావత్ బాలు నాయక్, పీఎం కృష్ణా రెడ్డి, మాటేడు జనార్ధన్, శెట్టిపల్లి సోమయ్య, పులి వెంకన్న, బాసు, భీముడు, దరావత్ భాస్కర్, తొర్రూర్ బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు యర్రం రాజు, పెద్ద వంగర సోషల్ మీడియా కోఆర్డినేటర్ మైలపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
బుధవారం 20 ఆగస్టు 2025
7

# ఫౌజీ నుంచి ప్రభాస్ లుక్ లీక్

### అలాంటివి షేర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

హను రాఘవపూడి, ప్రభాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న 'ఫౌజీ' సినిమా నుంచి ప్రభాస్ లుక్ లీకైంది. అందులో ఈ హీరో వింటేజ్ లుక్‌లో కనిపించడంతో అది క్షణాల్లో వైరలైంది. నెటిజన్లు దాన్ని తెగ షేర్ చేశారు. తాజాగా దీనిపై నిర్మాణ సంస్థ స్పందించింది. కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.ఈ సినిమా కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు. చిత్రీకరణ సమయంలో సెట్స్ నుంచి ఓ ఫొటో బయటకు వచ్చిన విషయం మా దృష్టికి వచ్చింది. మీకు అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని ఇచ్చేందుకు మేం నిరంతరం కృషి చేస్తున్నాం. ఇలాంటి లీక్‌లు మా టీమ్ నైతికతను దెబ్బతీస్తాయి. అనధికారికంగా ఎవరైనా ఈ సినిమా ఫొటోలు షేర్ చేస్తే వారి ఖాతాలను తొలగించడమే కాకుండా సైబర్ నేరంగా పరిగణిస్తాం. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇక 'ఫౌజీ' విషయానికొస్తే.. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతోంది. ప్రభాస్‌కు జంటగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. 1940వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి ఓ యోధుడు చేసే పోరాటంగా మూవీ రానుంది. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడిరచి హను రాఘవపూడి ఈ కథను సిద్ధం చేశారు.






## అలాంటి కామెంట్స్ పట్టించుకోను

### పరదా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది

సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోవడం మానేసినట్లు నటి అనుపమ పరమేశ్వరన్ కుండబద్దలు కొట్టారు. సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోను. నేను పరదా పోస్టర్స్ షేర్ చేసినప్పుడు కూడా కొందరు దీనికి నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. 'అట్టర్ ఫ్లాప్ అవుతుంది' అన్నారు. ఆ వ్యాఖ్యలు మా సినిమాను నిర్ణయించలేవు. ఒకవేళ నిజంగానే ఇది ప్రేక్షకాదరణ పొందలేకపోయినా.. నేను ఒక మంచి సినిమా తీశాననే సంతృప్తి నాకు జీవితమంతా ఉంటుంది. ఆమె ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన 'పరదా' ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను ఆమె పంచుకున్నారు. కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో ఇలాంటి కామెంట్స్ విని బాధ పడేదాన్ని. అనుభవం వచ్చే కొద్దీ ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయి. గతంలో ప్రతి పోస్ట్‌కు వచ్చిన కామెంట్స్ అన్నీ చదివేదాన్ని. ఇప్పుడు నేను చెప్పాలనుకున్న విషయం చెప్పేసి వదిలేస్తున్నా. ఎవరెన్ని మాటలన్నా మనం జీవితంలో ముందుకు వెళ్లాల్సిందే అని అర్థం చేసుకున్నప్పుడు ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయన్నారు. టిల్లు స్క్వేర్ తర్వాత నేను మాట్లాడే విధానంలోనూ మార్పు వచ్చింది. ఆ సినిమా విడుదలకు ముందు నాపై చాలా నెగెటివిటీ– వచ్చింది. రిలీజ్ అయ్యాక ప్రశంసలు వచ్చాయి. –ట్రైలర్ విడుదలయ్యాక నెగెటివిటీ– వస్తుందని తెలిసే ఆ పాత్రను ఎంపిక చేసుకున్నాను. అలాంటి రోల్స్‌ను అంగీకరించడమే ఒక సవాలు. వాటిని ఓకే చేయాలంటే ధైర్యం కావాలని తెలిపారు.






## బాహుబలి రీరిలీజ్ కోసం
## ఫ్యాన్స్ వెయిటింగ్

భారతీయ సినీ చరిత్రలో సెన్సేషన్ సృష్టించిన సినిమా 'బాహుబలి'. ఇప్పటికీ ఆ మ్యాజిక్, ఆ ఎమోషన్ ఎక్కడ తగ్గలేదు. ఇప్పుడు అదే బాహుబలి సరికొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు భాగాలను కలిపి, కొత్త సన్నివేశాలు జోడిరచి రూపొందించిన ఈ స్పెషల్ వెర్షన్‌కు పేరు – 'బాహుబలి ది ఎపిక్'. అక్టోబర్ 31న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై, అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభాస్, రానాలతో ఇప్పటికే ఒక స్పెషల్ ఇంటర్వ్యూ కూడా షూట్ చేసినట్లు– టాక్ ఉంది. అనుష్క కూడా పాల్గొనబోతుందన్న వార్తలు వినిపిస్తున్న, ఆ విషయాన్ని టీమ్ కన్ఫర్మ్ చేయలేదు. కానీ ప్రస్తుతం అనుష్క హైదరాబాద్‌లో ఉన్నందున సెప్టెంబర్‌లో జరిగే ఈవెంట్స్‌లో ఆమె పాల్గొనడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. వీరితో పాటుగా రమ్యకృష్ణ, తమన్నా, సత్యరాజ్, సుదీప్, నాజర్ తదితర తారలతో కూడా వరుస స్పెషల్ ఈవెంట్లు–, ఇంటర్వ్యూలు ప్లాన్ చేస్తున్నట్లు– సమాచారం. ఈ మొత్తం షెడ్యూల్‌ను కార్తికేయ పర్యవేక్షణలో సిద్ధం చేసారని తెలుస్తోంది. ఒకవేళ ఈ 'సింగిల్ పార్ట్ ఎపిక్ ఫార్ములా' సక్సెస్ అయితే, భవిష్యత్తులో పుష్ప, కెజిఎఫ్ వంటి బ్లాక్‌బస్టర్లు కూడా ఇదే రూట్ ఫాలో అయ్యే ఛాన్స్ ఉంది.

## ఆ స్టోరీ కోసమే మోక్షజ్ఞ చూపు

బాలయ్య వారసుడి ఎంట్రీపై నారా రోహిత్ నందమూరి అభిమానులతో పాటు– సినీ ప్రియులంతా బాలయ్య నటవారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా మోక్షజ్ఞ లుక్ కూడా ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నటుడు నారా రోహిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇండస్ట్రీకి వచ్చేందుకు ఈ నందమూరి వారసుడు చాలా ఆసక్తిగా ఉన్నాడని తెలిపారు. ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసం చూస్తున్నట్లు– చెప్పాడు. ఈ ఏడాది చివర్లో, లేదంటే వచ్చే సంవత్సరం ప్రారంభంలో అతని ఎంట్రీ ఉండే అవకాశం ఉంది. ఇండస్ట్రీకి రావడం కోసం అతడు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. సినిమాల కోసమే లుక్ మార్చుకున్నాడు. గతంలో లుక్ కంటే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ కోసం వెతుకుతున్నట్లు– ఈ మధ్య కలిసినప్పుడు చెప్పాడు. అలాంటి కథ ఉంటే ఈ ఏడాదిలోనే ఎంట్రీ– ఉండే అవకాశం ఉందని నారా రోహిత్ తెలిపారు. బాలకృష్ణతో తన మల్టీ స్టారర్‌పై నారా రోహిత్ స్పందించారు. గతంలో స్క్రిప్ట్ రెడీ చేసినట్లు– చెప్పారు. కథ రెడీ చేశారు. మా ఇద్దరికీ లుక్ టెస్ట్ కూడా చేశారు. కథ నచ్చింది. కానీ, ఆ సమయంలో ఆయనకు వరుస సినిమాలు, ఎలక్షన్స్ ఉండడంతో అది పట్టాలెక్కలేదు. బాలయ్య నటించిన మరో సినిమాలోనూ నేను అతిథి పాత్రలో చేయాల్సిఉంది. కానీ, అది కూడా కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. ఆ సినిమా స్థానంలోనే ఆయన 'లెజెండ్' చేశారు. భవిష్యత్తులో బాలయ్యతో కలిసి నటించే అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆ రోజు కోసమే ఎదురుచూస్తున్నా అని నారా రోహిత్ చెప్పారు. ప్రస్తుతం నారా రోహిత్ నటించిన 'సుందరకాండ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఆయన కథానాయకుడిగా కొత్త దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రమిది. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘని కథానాయికలు. ఈనెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



# కొరత తీరేదెలా..?

- జోరువానలతో పెరిగిన సాగు విస్తీర్ణం
- విచ్చలవిడిగా యూరియా వాడకం
- దెబ్బ తింటున్న భూ సారం
- అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** జోరువానలతో పెరిగిన సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నీటి సదుపాయం అధికం కావడంతో వరి పంట సాగు గణనీయంగా పెరిగింది. ఆరుతడి పంటలను తగ్గించి చెలక భూములను చదును చేసి వరి పంట వేయడం మొదలు పెట్టారు. అయితే వరి, మొక్క జొన్న సాగుకు యూరియా అవసరం ఎంతైనా ఉంటుంది. వరిసాగు ప్రారంభం నుంచి అది చేతికి వచ్చే వరకు రైతులు ఎక్కువగా యూరియానే వాడుతారు. ఎంత ఎక్కువ యూరియా వాడితే అంత పంట దిగుబడి పెరుగుతుందన్న అపోహతోనే రైతులు ఇష్టారీతిన యూరియా చల్లుతున్నారు. ఒక ఎకరా వరి సాగుకు కేవలం 50కిలోల యూరియా చాలని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. కానీ కొందరు రైతులు 15 రోజులకొకసారి ఒక యూరియా బస్తాను ఎకరా పొలానికి వాడుతున్నారంటే వారు ఎంత మొత్తంలో యూరియా వాడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో సాగుచేస్తున్న కొందరు రైతులు సీజన్ కు ముందే లోడు యూరియా బస్తాలు తెచ్చుకొని నిల్వ చేసుకుంటున్నారు. దీంతో ఇప్పుడు చిన్న, సన్న కారు రైతులకు తిప్పలు తప్పడం లేదు.

### పట్టించుకోని అధికారులు..

అవసరాన్ని ఆసరాగా చేసుకునే అధికారులు యూరియా కొరత ఏర్పడినప్పుడే నానా హంగామా చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు ఉంటేనే యూరియా బస్తాలు ఇస్తామని చెప్పే అధికారులు సీజన్ ప్రారంభం నుంచే యూరియా కట్టడికి కఠిన చర్యలు తీసుకొని ఉండాల్సిందంటున్నారు. అలాగే యూరియా బస్తాలకు ప్రత్యామ్నాయంగా వాడకంలోకి తీసుకువచ్చిన నానో యూరియా వాడకంపై అన్నదాతలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. నానో యూరియా వాడకం పెరిగితే రైతుల తిప్పలు తప్పుతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఎరువుల వృథా తగ్గించుకోవచ్చు అంటున్నారు. అలాగే భూసారం దెబ్బతినకుండా, పర్యావరణ హితంగా ఉంటుందంటున్నారు. దీన్ని పంపు, డ్రోన్ల ద్వారా స్ప్రే చేయటంతో పంటకు కూడా పూర్తి స్థాయిలో అందుతుంది. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి నానో ఎరువుల వాడకం గురించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, స్ప్రేయర్లు, డ్రోన్లు సబ్సిడీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు.

### ఎకరాకు ఒక్క బస్తే..

పీఏసీఎస్ కేంద్రాల్లో ఒక ఎకరాకు ఒక్కో బస్తా చొప్పున రైతులకు ఇస్తున్నారు. దీంతో కౌలు రైతుల పరిస్థితి ఆగంగా మారుతోంది. భూ యజమానులు పట్టా దారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వకుంటే తాము ఎలా యూరియా తెచ్చుకోవాలని కౌలుదారులు ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా యూరియా అందజేయాలని కైలు రైతులు కోరుతున్నారు.

# పంట బీమా చెల్లింపుల్లో ఆలస్యం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- రైతుల సమస్యలపై పార్లమెంట్ లో నిలదీత


**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులకు రావలసిన పంట బీమా డబ్బులు ఆలస్యంగా అందుతున్నాయని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోకసభలో ప్రస్తావించారు. ఈ ఆలస్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఎంత మొత్తంలో డబ్బులు బకాయిలు ఉన్నాయి, ఆలస్యం జరిగినప్పుడు రైతులకు వడ్డీ చెల్లించారా, భవిష్యత్తులో ఇలాంటి జాప్యం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ వివరణ కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2016 నుంచి ఇప్పటివరకు రూ.1.89 లక్షల కోట్లలో రూ.1.85 లక్షల కోట్లు చెల్లించారని, ఇంకా 3,249.70 కోట్లు బకాయిగా ఉన్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువ మొత్తంలో డబ్బులు బకాయిగా ఉన్నట్లు తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి గ్రీవెన్స్ కమిటీలు, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ 14447, ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆలస్యంగా చెల్లించినప్పుడు 12శాతం వడ్డీ ఇవ్వాలనే నిబంధన ఉందని మంత్రి గుర్తు చేశారు.



# చెత్త తరలింపునకు పక్కా ప్రణాళిక

- వాహనాల సమాచారం నమోదు చేయాలి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- రాంపూర్ డంపింగ్ యార్డులో క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, రాంపూర్ :** చెత్త తరలింపు వాహనాల సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాంపూర్ లోని డంపింగ్ యార్డ్ ను కమిషనర్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. అక్కడ చేపట్టిన పనులు సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డులో దొరికే వ్యర్థాల కోసం చేసిన పనుల నిర్ధారణ, బిల్లుల చెల్లింపులు వాస్తవ స్థితి గతులపై కమిషనర్ క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. అగ్రిమెంట్ ప్రకారం పనులు జరిగాయా అంటూ స్మార్ట్ సిటీ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులకు తగు సూచనలు చేసిన కమిషనర్ మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ కు చెత్తను తరలించే వాహనాలకు చెత్తతో కూడిన వాహనాల బరువు (నెట్ వెయిట్) చెత్త వేసిన తర్వాత వచ్చే బరువు (లాస్ వెయిట్) వచ్చే విధంగా ఏర్పాటు ఉండాలని, ఏ వాహనం ఎన్ని ట్రిప్పులు వేస్తుందో నమోదు చేసుకోవాలని సానిటరీ ఇన్స్పెక్టర్లు, జవాన్లను ఆదేశించారు. చెత్త తరలింపు కోసం నిర్వహిస్తున్న పలు వాహనాల లాగ్ బుక్ లను పరిశీలించిన కమిషనర్ సరిగా వివరాలు నమోదు చేయని డ్రైవర్ లపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయంగా మనకు వేరే డంపింగ్ యార్డ్ లేనందున మనం క్లీన్ చేసిన 17 ఎకరాల స్థలంలో ఐదు ఎకరాలు ఫ్రెష్ డంప్ కు వినియోగించుకోవాలని మిగతా స్థలాన్ని ప్రాసెసింగ్ కోసం ఉపయోగించాలని స్మార్ట్ సిటీ ప్రతినిధులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ మహేందర్, డీఈ రవి కిరణ్, ఏఈలు రామన్న, సంతోష్ కుమార్, సానిటరీ ఇన్ స్పెక్టర్ రవీందర్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.



# పద్మశాలి జిల్లా అధ్యక్షుడికి సన్మానం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** లయన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా పద్మశాలి జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పద్మశాలి పట్టణ కార్యదర్శి దాసి రాందేవ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పద్మశాలీలను సంఘటితం చేసేందుకు జిల్లా కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు వారి అభ్యున్నతికి ఆడెపు రవీందర్ కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారని రాందేవ్ కొనియాడారు. కళా రంగంలో మంచి గుర్తింపు పొందిన రవీందర్ కు రోజా క్రియేషన్స్ వారు కాకతీయ మహా నంది అవార్డుకు ఎంపిక చేయడం పద్మశాలీలకు ఎంతో గర్వకారణం అన్నారు. రవీందర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన రాందేవ్ పద్మశాలీల కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని అభిలషించారు. ఈ సందర్భంగా పద్మశాలి జిల్లా కమిటీ ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- గణపతుల తరలింపులో ఎలాంటి లోపం లేకుండా చూడాలి
- విద్యుత్ అధికారులను ఆదేశించిన సీఎండి కర్నాటి వరుణ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ విగ్రహాల తరలింపులో విద్యుత్ అధికారులు అప్రమమతంగా ఉండాలని, విద్యుత్ నెట్వర్క్ పరంగా ఎలాంటి లోపం లేకుండా చూడాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. నక్కల గుట్టలోని విద్యుత్ భవన్ నుంచి ఆయన 16 సర్కిళ్ల పరిధిలోని సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలను సందర్శించి ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ లైన్ ల ఎత్తు పెంచాలన్నారు. భారీ విగ్రహాల తరలింపులో విద్యుత్ తీగలకు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల్లో విద్యుత్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మండప నిర్వాహకులను, ప్రజలకు సూచించారు. విగ్రహాల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వెల్లడించారు. టీవీ కేబుల్ వైర్లు, ఇంటర్నెట్ కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకొని కేబుల్ వైర్లను రి-అలైన్మెంట్ చేసుకోవాలన్నారు. చిందరవందరగా ఉన్న కేబుల్ వైర్లతో ప్రమాదాలు పొంచిఉన్నాయన్నారు. మొదట ప్రజల భద్రత, ప్రాణాలు ముఖ్యమని పేర్కొన్నారు. ఒక పద్ధతి ప్రకారం కేబుల్ వైర్లు అమర్చుకోకుంటే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ లైన్స్ తెగి పడినా, ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే 1912 కు గాని సమీప ఫ్యూజ్ ఆఫ్ కాల్ కు ఫోన్ చేయాలని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్ వి.మోహన్ రెడ్డి, డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్, సీజీఎం అశోక్, జీఎం సురేందర్, 16 సర్కిళ్ల సూపెరింటెండింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com